క్లుప్తంగా

నేడు మల్హర్‌రావు జయంతి

మల్హర్ : కొయ్యూరు సెంటర్‌లో మాజీ ఎంపీపీ బెల్లకొండ మల్హర్‌రావు జయంతి వేడుకలు నేడు (మంగళవారం) నిర్వహించనున్నట్లు మాజీ జెడ్పీటీసీ గోనె శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేడుకలకు మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు, మాజీ జెడ్పీచైర్మన్ జక్కు శ్రీహర్షిణి రాకేష్‌లు హాజరు కానున్నట్లు చెప్పారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నేడు వైద్యశిబిరం

మల్హర్ : మండలంలోని రుద్రారం గ్రామంలో నేడు (మంగళవారం) మెడికల్ క్యాంపు నిర్వహించనున్నట్లు మండల వైద్యాధికారి వినయ్‌భాస్కర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుద్రారం పల్లె దవాఖాన (సబ్ సెంటర్)లో ఉదయం 9 గంటలకు వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. శిబిరంలో వివిధ పరీక్షలు నిర్వహించి అవసరమైన రోగులకు మందులు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. గ్రామస్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

బంగారు గొలుసు చోరీ

గణపురం: వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసును అపహరించిన ఘటన చెల్పూర్‌లో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం .. మండలంలోని చెల్పూర్‌కు చెందిన నరహరి కమలమ్మ సోమవారం స్థానిక పీహెచ్‌సీకి మందులు తీసుకునేందుకు వెళ్లింది. మందులు తీసుకుని బయటకు వచ్చి ఇంటికి వెళ్తున్న వృద్ధురాలిని గుర్తుతెలియని వ్యక్తి ఇంటి దగ్గర దించుతానని చెప్పడంతో ఆమె ద్విచక్రవాహనం ఎక్కింది. దీంతో ఆమెను గ్రామశివారు గొల్లపల్లి రోడ్డుకు తీసుకెళ్లి బెదిరించి మెడలో ఉన్న రెండు తులాల బంగారు గొలుసును ఎత్తుకెళ్లాడు. వృద్ధురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

అమృతమా.. విషమా?

- గడువు తీరిన బాలామృతం పంపిణీ


కాలపరిమితి ముగిసిన బాలామృతం ప్యాకెట్

రేగొండ: కేంద్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా 'బాలామృతం' పేరుతో ఆరు నెలల వయసు నుంచి మూడేళ్ల లోపు పిల్లలకు పౌష్టికాహారం అందజేస్తోంది. అయితే అధికారుల నిర్లక్ష్యంతో గడువు తీరిన పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న ఘటన మండలంలోని కొడవటంచ సెక్టార్ పరిధిలోని రాయపల్లిలో సోమవారం వెలుగులోకి వచ్చింది. గ్రామంలోని ఓ అంగన్‌వాడీ కేంద్రంలో లబ్ధిదారులకు బాలామృతం ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఆ ప్యాకెట్ల గడువు జూలై 25వ తేదీతో ముగిసింది. గడువు తీరిన ఆహారం తింటే విషంగా మారుతుందని తెలిసినా పిల్లలకు పంపిణీ చేయడంతో ఐసీడీఎస్ అధికారుల నిర్లక్ష్యం అర్థమవుతోంది. అలాగే, కుళ్లిన గుడ్లను ఉడకబెట్టి పిల్లలకు ఆహారంగా ఇస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. క్షేత్ర స్థాయిలో ఉన్నతాధికారులు, సూపర్‌వైజర్ల పర్యవేక్షణ లేకపోవడంతోనే అంగన్‌వాడీ సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు చర్చించుకుంటున్నారు.

డబుల్‌బెడ్ రూం ఇల్లు రావడం లేదని..

- మనస్తాపంతో మహిళ మృతి
- జవహర్‌నగర్ కాలనీలో ఘటన


సమ్మక్క(ఫైల్)

భూపాలపల్లి అర్బన్: బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన డబుల్‌బెడ్ రూం ఇల్లు రావడం లేదనే కారణంతో మనస్తాపం చెందిన ఓ మహిళ అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం .. గత ప్రభుత్వ హయాంలో మున్సిపల్ పరిధిలోని భాస్కర్‌గడ్డ సమీపంలో డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించారు. ఇందులో పట్టణంలోని జవహర్‌నగర్ కాలనీలో అద్దెకుంటున్న తాటికొండ సమ్మక్క(52)కు ఇల్లు మంజూరైంది. అయితే రెండేళ్లు గడిచినా కాంగ్రెస్ ప్రభుత్వం పంపిణీ చేయకపోవడంతో పాటు జాబితా నుంచి తన పేరు తొలగించారనే కారణంతో సమ్మక్క కొంతకాలంగా మనస్తాపానికి గురవుతోంది. దీనిపై పలుమార్లు కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం చుట్టు తిరిగితే ఎవరూ పట్టించుకోలేదు. దీంతోపాటు ఇంటి అద్దె చెల్లించలేక మనోవేదనకు గురై ఇటీవల అనారోగ్యానికి గురైంది. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది.

వేతనాలు విడుదల చేయాలి

ములుగు రూరల్ : రాష్ట్ర వ్యాప్తంగా ఎఫ్‌డీహెచ్ఎస్ 104 సర్వీసెస్‌లో పని చేస్తున్న ఉద్యోగుల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని ఆ సంఘం నాయకుడు రమేశ్ అన్నారు. సోమవారం రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్కకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి కంటిన్యూయేషన్ ఆర్డర్లు ఇప్పించాలని కోరారు. స్పందించిన మంత్రి సీతక్క హెల్త్ మినిస్టర్‌తో మాట్లాడి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

బీమా.. కుటుంబానికి ధీమా!

కొత్త దరఖాస్తులకు ఆహ్వానం
- జూన్ 5 నాటికి పట్టాపాస్ పుస్తకాలు పొందిన రైతులకు అవకాశం
- రేపటితో ముగియనున్న గడువు


తాడిచర్ల రైతువేదికలో రైతుల నుంచి బీమా దరఖాస్తులు స్వీకరిస్తున్న ఏఓలు

మల్హర్ : రైతు సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం 'రైతు బీమా' పథకాన్ని 2018 ఆగస్టు నుంచి అమలు చేస్తోంది. బీమా వర్తింపు సంవత్సర కాలం . ఏటా ఆగస్టు 14 నుంచి తర్వాత సంవత్సరం ఆగస్టు 13 వరకు అమలులో ఉంటుంది. దీనికోసం ప్రతీ సంవత్సరం నిర్ణీత కాలంలో రెన్యువల్ చేసుకోవాలి. ఈ పథకం కింద నమోదైన రైతు ఏ విధంగా మరణించినా బాధిత కుటుంబానికి బీమా పరిహారం రూ.5 లక్షలు అందుతుంది.

పదిరోజుల్లో పరిహారం

వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓలు) నామినీ నుంచి రైతు బీమా డెత్‌క్లెయిమ్ డాక్యుమెంట్లు స్వీకరిస్తారు. రైతు మరణించిన రెండు, మూడు రోజులకే ధృవ పత్రాలను పోర్టల్లో అప్‌లోడ్ చేస్తారు. పది రోజుల్లో బాధిత కుటుంబానికి ఎల్ఐసీ నుంచి పరిహారం అందేలా చూస్తారు. 2017–25 వరకు మండలంలోని ఇప్పటి వరకు 30 కుటుంబాలకు రూ.1.27 కోట్లు బీమా డబ్బులు అందించినట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. మొత్తం 2017–2024 వరకు 5,605 మంది రైతులకు బీమా చేశామని, ప్రస్తుతం 2025 జూన్ 5 వరకు బీమా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఏఓ తెలిపారు.

బీమా నిబంధనలు
- బీమా నమోదు సమయంలో తమ వివరాలు పోర్టల్‌లో సరిగ్గా ఉన్నాయా లేదా అని రైతులు సరిచూసుకోవాలి. తప్పులు ఉంటే ఏఈఓ ద్వారా సరిచేసుకోవాలి.
- నామినీగా రైతు తమ కుటుంబ సభ్యులను మాత్రమే ఎంచుకోవాలి.
- ఇతరులను నామినీగా పేర్కొంటే బంధుత్వాన్ని నిర్ధారించుకోవాలి. గతంలో నమోదై నామినీ చనిపోతే కొత్తవారిని ఎంట్రీ చేసుకోవాలి.
- 18–59 ఏళ్ల వయస్సు ఉన్న రైతులే ఈ పథకానికి అర్హులు.

మార్పులు, చేర్పులకు అవకాశం



"జూన్ 5 వరకు కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన రైతులు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చు. పాస్‌బుక్, ఆధార్‌కార్డు (18–59 సంవత్సరాలు) జిరాక్స్, దరఖాస్తులతో సంబంధిత రైతు నేరుగా వచ్చి ఈనెల 13 లోగా సంబంధిత ఏఈఓలు సమర్పించాలి. మార్పులు, చేర్పులకు అవకాశం ఉంటుంది. పూర్తి వివరాలకు క్లస్టర్ పరిధిలోని ఏఈఓలను సంప్రదించాలి.

- శ్రీజ, ఏఓ, మల్హర్

ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలి

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం దేవస్థానంలో ఓ సీనియర్ ఉద్యోగి అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న విషయంపై దేవస్థానం ఈఓ చర్యలు తీసుకోవాలని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి బొల్లం కిషన్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఆ ఉద్యోగిపైన పలు ఆరోపణలు వస్తున్నా విచారణ జరుపకుండా తాత్సారం చేస్తున్నారని అన్నారు. ఈఓ స్పందించకపోతే బీజేపీ ఆధ్వర్యంలో ఈఓ కార్యాలయం ఎదుట ఆందోళ చేపడుతామని పేర్కొన్నారు.

'ఈఓ స్పందించాలి'

దేవస్థానంలో ఓ సీనియర్ ఉద్యోగి తీరుతో ఆలయ ప్రతిష్ట దిగజారిపోతుందని, ఆయనపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడంలో ఈఓ స్పందించకపోవడం ఏంటని సోమవారం ప్రకటనలో మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు బెల్లంపల్లి సురేష్ మాదిగ అన్నారు. ఉద్యోగిపై తగు చర్యలు తీసుకోకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

ఎండిన చెట్లను తొలగించాలి

మొగుళ్లపల్లి: మండలంలోని పాత ఇస్సిపేటలోని బస్సులు ఆగే స్థల సమీపంలో రెండు ఎండిన చెట్లు ఉన్నాయి. అవి ఎప్పుడూ పడిపోతాయోనని బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులు భయపడుతున్నారు. సంబందింత అధికారులు ఆ చెట్లను తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.


పాత ఇస్సిపేటలో ఎండిపోయిన చెట్లు...

రైతు వేదికకు దారేది ?

- గాలికి కొట్టుకుపోయిన రేకులు
- ఇబ్బంది పడుతున్న రైతులు
- పట్టించుకోని అధికారులు


అధ్వానంగా రైతు వేదిక

చిట్యాల : మండలంలోని ఒడితల గ్రామంలో ఉన్న రైతు వేదిక ఊరికి దూరంగా బండరాళ్లపై లక్షలు వెచ్చించి నిర్మించారు. దీంతో రైతువేదికకు సరైన దారి లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వం 2021 సంవత్సరంలో మండలంలోని ఐదు క్లస్టర్లలో (చిట్యాల,ఒడితల, నైన్‌పాక, చైన్‌పాక, జూకల్) రైతు వేదికలను నిర్మించింది. రైతులు తమ సమస్యలను అధికారులు గుర్తించి తగిన సలహాలు, సూచనలు తెలుసుకోవచ్చని రైతులు సంబురపడ్డారు. కానీ వారి ఆనందం మూణ్నాళ్ల ముచ్చటగానే మిగిలిపోయింది. గత ఏడాది క్రితం గాలివాన బీభత్సానికి ఒడితల రైతు వేదికపైన ఉన్న రేకులు కొట్టుకపోయాయి. ఏవైనా సమావేశాలు నిర్వహించాలంటే అనేక అవస్థలు పడుతున్నారు. రైతువేదికకు మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకరావాలని రైతులు కోరుతున్నారు.

మౌలిక వసతులు కరువు

రైతు వేదికలో కనీస మౌలిక వసతులు లేకపోవడంతో సంబంధిత అధికారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాగునీటికి అనేక కష్టాలు ఎదుర్కొంటున్నారు. అలాగే రైతు వేదిక నిర్మాణానికి నాసిరకం పనులు చేయడంతో వేదిక ముందు మెట్లు కూలిపోయాయి. దీంతో రైతు వేదిక అధ్వానంగా తయారైంది.

ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలి


చిట్యాల : విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మౌనిక



మొగుళ్లపల్లి : కార్యక్రమంలో మాట్లాడుతున్న తహసీల్దార్ సునిత

కాళేశ్వరం: నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని అంబట్‌పల్లి వైద్యాధికారి కళ్యాణి, డాక్టర్ జగదీష్‌లు అన్నారు. సోమవారం మహాదేవపూర్, పలిమెల మండలాల పరిధిలోని అంబట్‌పల్లి పీహెచ్‌సీ వైద్యుల ఆధ్వర్యంలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. పీహెచ్ పరిధిలోని అన్ని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు, జిల్లా పరిషత్, ప్రైవేటు, కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయం, ఆశ్రమ పాఠశాల, అంగన్వాడి కేంద్రాలు 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు కలిగిన పిల్లలందరికీ నులిపురుగుల నివారణ కొరకై ఆల్బెండజోల్ మాత్రలు ప్రతి పిల్లవాడికి వేయాలని సంకల్పంతో చేపట్టారు. కార్యక్రమంలో డాక్టర్ జగదీష్ ఖన్నా వైద్య ఆరోగ్య సిబ్బందితో సూరారం పాఠశాలలను స్వయంగా పాల్గొని నులిపురుగుల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూరారం హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు పురుషోత్తం రెడ్డి ఉన్నారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

చిట్యాల: మండలంలోని ఒడితల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రాగల్ల మౌనిక ఆధ్వర్యంలో సోమవారం గ్రామంలోని శ్రీవివేకానంద హైస్కూల్ విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేసినట్లు ఆమె పేర్కొన్నారు. అనంతరం అమె మాట్లాడుతూ విద్యార్థులు పరిశుభ్రంగా ఉండాలని కోరారు. మంచినీరు వాడకం శానిటేషన్ వ్యక్తిగత పరిశుభ్రత వంటి అంశాలపై విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సురేష్, హెచ్ఈఓ సంజీవ రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


కాళేశ్వరం : నులిపురుగుల గురించి అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి జగదీశ్

పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలి

టేకుమట్ల: ఒకటి సంవత్సరం నుంచి 19 ఏళ్ల వయస్సు గల పిల్లలందరికీ నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలను తప్పని సరిగా వేయించాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఆశాజ్యోతి అన్నారు. ఆదివారం జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా వెలిశాల ప్రాథమిక, ఉన్నత పాఠశాలల విద్యార్థులందరికి ఆల్బెండజోల మాత్రలను వేసారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రసాద్, హెల్త్ సూపర్‌వైజర్ విజయ, హెల్త్ అసిస్టెంట్ కృష్ణారెడ్డి, ఏఎస్ఎం సంగీత, రాజ్యలక్ష్మీ, రామారావు, నరేష్, ముత్యం, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత ఆరోగ్యంపై జాగ్రత్తలు వహించాలి



టేకుమట్ల : విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను వేస్తున్న వైద్య సిబ్బంది

మొగుళ్లపల్లి: వ్యక్తిగత పారిశుద్ధ్యంపై జాగ్రత్త వహించాలని మనం మన పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని విద్యార్థినులకు తహసీల్దార్ సునిత, ఎంపీడీఓ సరేందర్ సూచించారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం పురస్కరించుకొని సోమవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించిన నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. పిల్లలందరూ ఆల్బెండజోల్ మాత్రలు తీసుకొని నులిపురుగుల బారి నుంచి రక్షణ పొంది ఎనిమియా తదితర జబ్బులు రాకుండా మానసిక, శారీరకంగా ఆరోగ్యంగా ఉంటూ అన్ని రంగాలలో అభివృద్ధి సాధించాలని అన్నారు. నేడు మాత్రలు తీసుకోని విద్యార్థులకు మరోమారు పంపిణీ చేయడం జరుగుతుందని డాక్టర్ నాగరాణి తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి


రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రవి

వెంకటాపురం(కె) : విద్యార్థులకు పాఠశాల సమయంలో బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ సోమవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆలుబాక గ్రామంలో ఆర్అండ్‌బీ రహదారిపై రాస్తారోకో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రవి మాట్లాడుతూ ఎదిర, సూరవీడు, అబ్బాయిగూడెం గ్రామాల నుంచి ఆలుబాక జిల్లా పరిషత్ పాఠశాలకు వచ్చే విద్యార్థులకు పాఠశాల సమయానికి బస్సు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బస్సులు లేక ఆటోలో రావడానికి రోజుకు రూ.100 ఖర్చు పెట్టాల్సి వస్తుందని అన్నారు. నిరుపేద విద్యార్థులు డబ్బులు లేక చదువులు మానేసే దుస్థితి ఏర్పాడ్డాయని అన్నారు. అధికారులు స్పందించి బస్సు సౌకర్యం కల్పించడంతో పాటు విద్యారంగ సమస్యలను పరిష్కరిచాలని డిమండ్ చేశారు. లేని పక్షంలో దశల వారీగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

సీజనల్ వ్యాధుల పై అప్రమత్తంగా ఉండాలి

వెంకటాపురం(కె): సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి జ్యోతి అన్నారు. సోమవారం మండల పరిధిలోని బెస్తగూడెం, పర్శికగూడెం గ్రామాల్లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్యశిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. అనంతరం గ్రామస్తులకు సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. బెస్తగూడెం పాఠశాల విద్యార్థులకు నులిపురుగుల మాత్రలను వేశారు. వైద్యాధికారులు భాస్కర్, ఆశీష్, డీపీఎంఓ సత్యనారాయణ, యాకలక్ష్మి, హెచ్ఈఓ కోటిరెడ్డి పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలి

వాజేడు : 42 శాతం బీసీ రిజర్వేషన్లను అమలు చేస్తూ రాజ్యాంగ సవరణ ద్వారా చట్టబద్ధత కల్పించాలని కోరుతూ సోమవార తహసీల్దార్ శ్రీనివాస్‌కు సీపీఎం మండల నాయకులు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి రఘుపతి మాట్లాడుతూ తెలంగాణ రాష్టంలో అత్యధిక బీసీ జనాభా కలిగి ఉన్నప్పటికీ జనాభా ప్రాతిపదికన నిధులు, నియామకాలు, చట్టసభల్లో రిజర్వేషన్లు లేకపోవడంతో నష్టపోతున్నట్లు తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు సంబంధించి పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టి రాజ్యాంగం ద్వారా చట్టబద్ధత కల్పించాలని అదే సమయంలో రాష్ట్రపతి ఆమోదానికి పంపించి ఆమోదింపచేయాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో దేవయ్య, దామోదర్, కృష్ణ బాబు ఉన్నారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

సెల్‌ఫోన్ అప్పగింత


బాధితుడికి సెల్‌ఫోన్ అందజేస్తున్న ఎస్సై శ్రావణ్‌కుమార్

చిట్యాల: మండల కేంద్రంలోని క్రోసూరుపల్లి గ్రామానికి చెందిన ఎండి. సాజిద్ వారం క్రితం తన సెల్‌ఫోన్ ఎక్కడో పోగొట్టుకున్నాడు. దీంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు సీఈఐఆర్ ద్వారా సెల్‌ఫోన్ గుర్తించి బాధితుడికి ఎస్సై శ్రావణ్‌కుమార్ చేతుల మీదుగా సోమవారం అందజేశారు. సీఈఐఆర్ ద్వారా సెల్‌ఫోన్ గుర్తించిన కానిస్టేబుల్ లాల్‌సింగ్‌ను ఎస్సై అభినందించాడు. సెల్‌ఫోన్ గుర్తించి అప్పగించినందుకు పోలీస్ సిబ్బందికి బాధితుడు సాజిద్ కృతజ్ఞతలు తెలిపాడు.

వేతనాలు ఇచ్చి ఆదుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న నరేశ్

ఏటూరునాగారం : మిషన్ భగీరథ కార్మికులకు వేతనాలు చెల్లించాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బలుసుపాటి నరేశ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రజలకు తాగునీరు అందిస్తున్న భగీరథ కార్మికులకు సకాలంలో వేతనాలు ఇవ్వకుండా వారి కష్టాన్ని దోచుకుంటున్నారన్నారు. నాలుగు నెలల నుంచి వేతనాలు అందక సిబ్బంది తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. కేబీఎస్ఆర్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మిషన్ భగీరథ నీటి సరఫరా పథకంలో పనిచేస్తున్న కార్మికులతో సంస్థ పని చేసుకుంటుందని, వేతనాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. వెంటనే వేతనాలు ఇచ్చి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో జస్వంత్, నవీన్ పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఐ కార్యదర్శి రాజు

ములుగు రూరల్ : ఈ నెల 19 నుంచి 22 వ రకు మేడ్చల్ జిల్లా గాజులరామారంలో జరిగే సీపీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి ముత్యాల రాజు అన్నారు. సోమవారం జిల్లాకేంద్రంలోని మార్కెట్ యార్డులో కార్మికులతో కలిసి వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మికుల హక్కుల సాధనకు ప ని చేసేది ఎర్ర జెండా అని అన్నారు. మహాసభలకు కార్మికులు, కర్షకులు, హమాలీలు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు అధిక సంఖ్య లో పాల్గొని విజయవంతం చేయాలని అ న్నారు. కార్యక్రమంలో రమేశ్, భిక్షపతి, రఘు, రాజు, కుమార్, రవి, నరేష్ పాల్గొన్నారు.

యువత సన్మార్గంలో నడవాలి



యువకులకు వాలీబాల్ కిట్ అందజేస్తున్న ఎస్సై కృష్ణప్రసాద్

వాజేడు : యువత సన్మార్గంలో నడవాలని పేరూరు ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్ అన్నారు. మండలంలోని రాంపురంలో సోమవారం అభయమిత్ర కార్యక్రమంలో భాగంగా యువకులతో మాట్లాడారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, గంజాయి అమ్మడం, సేవించడం చేయవద్దన్నారు. అసాంఘిక శక్తులకు సహకరించవద్దని సూచించారు. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని తెలిపారు. ద్విచక్రవాహనంపై ముగ్గురు ప్రయాణించవద్దని అన్నారు. అమ్మాయిలపై అసభ్యకరంగా ప్రవర్తిస్తే పోక్సో చట్టంపై కేసు నమోదు చేస్తామన్నారు. ఈ సందర్భంగా యువకులకు వాలీబాల్ కిట్ అందించారు.

ట్రాన్స్ కో..జరదేఖో


వంగిన స్తంభం

మొగుళ్లపల్లి : మండల కేంద్రం నుంచి నవాబుపేట వెళ్లే ప్రధాన రోడ్డు పక్కన ఉన్న పత్తి చేనులో విద్యుత్ స్తంభాలు గతంలో కురిసిన వర్షాలకు వంగిపోయాయి. ప్రధాన విద్యుత్ లైన్ కావడంతో ఎప్పుడూ ఏం జరుగుతుందోనని రైతులు భయాందోళనలకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వంగిన స్తంభాలకు మరమ్మతులు చేపట్టాలని రైతులు వేడుకుంటున్నారు.